సాక్షి మంచిర్యాల

శుక్రవారం : 26 : జనవరి : 2024



ఇబ్బందులు ఉంటే తెలియజేయాలి

లక్సెట్టిపేట: జైలులో ఇబ్బందులుంటే తెలియజేయాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సబ్‌జైలులో అండర్ ట్రయల్ ఖైదీలకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్, జైలర్ స్వామి పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి జాతర

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం పుష్య పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు సమీప జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 172 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ధర్మారం మండలం నర్సింహులపల్లికు చెందిన బీటీ శ్రీహరి, వసంత, సత్యనారాయణ, స్రవంతి దంపతుల సహకారంతో ఆలయం వద్ద సుమారు 600 మంది భక్తులకు అన్నదానం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం

29.0 /16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. పొగ మంచు కురుస్తుంది.

దళారుల దందా.. మామూలే..!



చెన్నూర్ మండలంలో కొనుగోలు చేసిన పత్తి



రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు కొన్న పత్తి

- గ్రామాల్లో అక్రమంగా పత్తి కొనుగోళ్లు
- అరువుగా ఎరువులు ఇచ్చిన వారికే విక్రయాలు
- గ్రామాల్లో నిల్వకు గోదాముల ఏర్పాటు
- మోసపోతున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పత్తి రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో నష్టపోవాల్సి వస్తోంది. వ్యాపారులు గ్రామాల్లో ఇళ్ల అద్దెకు తీసుకుని పత్తి గోదాములుగా మార్చుకుంటున్నారు. కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేసి డీసీఎం, బొలేరో వాహనాల్లో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటు రైతులు నష్టపోవడమే కాకుండా అటు మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి పడుతోంది. అయినా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాలు, ఐరన్ బాట్లు, సాధారణ తూకాల్లో వారి మాయాజాలంతో మోసాలకు పాల్పడుతున్నారు. మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.900 వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తూకం వేసిన వెంటనే డబ్బులు చెల్లిస్తుండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ రంగ సీసీఐ కొనుగోలు కేంద్రాలు మార్కెట్‌యార్డుల్లో కాకుండా జిన్నింగ్‌మిల్లుల్లో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు మిల్లులు దూరంగా ఉండడంతో రవాణాపరంగా భారంగా మారుతోంది. పెద్దమొత్తంలో సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినా తేమ, రంగు మారిందని, తదితర నిబంధనలు, ధ్రువీకరణ పత్రాలు లేవంటూ కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయడం లేదు.

దిగుబడి రాక..

వేలాది రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు ఎదిగే సమయంలో భారీ వర్షాలు, పూత, కాత వచ్చే సమయంలో వర్షాభావం.. దిగుబడి సమయంలో అకాల వర్షాల కారణంగా రైతులు ఆశించిన దిగుబడులు రాలేదు. ఇటు దిగుబడి రాక.. దళారుల దగా కారణంగా నష్టపోతుండగా.. దళారుల వ్యాపారం జోరుగా సాగుతోంది. సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సీజన్ ప్రారంభం కాగానే పత్తి వ్యాపారంలో దళారులు రంగప్రవేశం చేసి అక్రమ పద్ధతిలో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారు 20శాతం కాగా.. 80శాతం మంది దళారులు నేరుగా గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి ఇష్టారీతిన ధరతో కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ ఫీజు చెల్లించకుండానే రాత్రికి రాత్రే డీసీఎం, వాహనాల్లో పత్తి తరలిస్తున్నారు. పత్తి పంట సాగు సమయంలో పెట్టుబడుల కోసం ఇచ్చిన అప్పులను తిరిగి రాబట్టుకోవడానికి కొందరు ఈ వ్యాపారం చేస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులు అరువుగా ఇచ్చిన తమకే పత్తి విక్రయించాలనే నిబంధనతో ధర తక్కువైనా విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

చేన్ల వద్దకే వ్యాపారులు..

గత డిసెంబర్ నుంచి జిల్లాలో పత్తి తీత జోరందుకుంది. ఆయా మండలాలకు అనువుగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు చేన్ల వద్దకే వెళ్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020గా ప్రకటించింది. ఆయా గ్రామాల్లో దళారులు క్వింటాల్ రూ.6,100 నుంచి రూ.6,300 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు రూ.500 నుంచి రూ.900 వరకు నష్టపోతున్నారు. మండలాల్లో కొనుగోలు చేసిన పత్తిని వ్యవసాయేతర, పట్టణాల్లో ఉన్న భూస్వాముల పట్టాపాస్ పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో సీసీఐ అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1200 వరకు లాభం ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. దళారుల దందా అరికట్టి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

గత ఏడాది కంటే ఈసారి 15వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. 1.55 లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. 12లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటివరకు 3లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. పత్తిని మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ఆశ్రయించవద్దని సీజన్ ఆరంభంలో ప్రకటించినా సాగు విస్తీర్ణం, దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. జిల్లాలో మూడు మార్కెట్ యార్డుల పరిధిలో ఆరు సీసీఐ కొనుగోలు కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేశారు. మార్కెట్‌యార్డులకు దూరంగా ఉండడం, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేకపోవడం, మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడం తదితర సమస్యలు ఉన్నాయి.

చిన్న చిన్న ముల్లెల్లో అమ్ముకుంటున్నారు..

గ్రామాల్లో కొన్ని చోట్ల రైతులు, కూలీలు చిన్న చిన్న ముల్లెల్లో పత్తిని అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేక చిన్న మొత్తంలో అక్కడక్కడ అమ్ముకుంటున్నట్లు తెలిసింది. కొంతమంది చిరు వ్యాపారులు ఐదు పది కిలోల చొప్పున మాత్రమే కొంటున్నారు. ఎక్కడ పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అలా కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

మంచిర్యాల బల్దియాలో స్పెషల్ ఆడిట్



ఆడిటింగ్ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: యేటా జిల్లాకు చెందిన ఆడిట్ శాఖ అధికారులు మంచిర్యాల మున్సిపాల్టీలో వార్షిక ఆడిటింగ్ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని బల్దియాల్లో వివిధ జిల్లాల ఆడిట్ అధికారులతో నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో స్పెషల్ ఆడిట్ ప్రారంభించారు. మంచిర్యాల గ్రేడ్–1 బల్దియాలో ఈ నెల 22నుంచి పెద్దపల్లి, జగిత్యాల, కుమురంభీ జిల్లాల ఆడిట్ అధికారులు స్పెషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. అకౌంట్లు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా ఇతర జిల్లాల వేర్వేరు అధికారులతో ఒక బృందం ఏర్పాటు చేసి ఆడిటింగ్ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రతియేటా దాదాపుగా రూ.50 కోట్లకు పైగా నిధులు మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులతోపాటు ఇతరత్రా ఖర్చులకు వినియోగిస్తుంటారు.

లొసుగులు బయట పడేనా...?

అన్ని రకాల పన్నులు, వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులకు చెల్లించిన నిధులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు చెల్లించే వేతనాలు ఇలా అన్నింటిని పరిశీలిస్తున్నారు. పాత రికార్డులతోపాటు 2022–23 ఆర్థిక సంవత్సరానికి చెందిన రికార్డులు, చెల్లించిన డబ్బులకు సంబంధించిన వాటిని పరిశీలిస్తున్నారు. గతంలో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు నల్లా బిల్లుల వసూలులో చేతివాటం ప్రదర్శించారు. మూడు రశీదు బుక్కులు ఇవ్వకుండా దాదాపుగా రూ.14 లక్షల వరకు చెల్లించలేదని గత ఆడిటింగ్‌లో తేలింది. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు మెమోలు జారీ కాగా, కొంతవరకు రికవరీ చేసినట్లు తెలిసింది. స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేసినప్పుడు ఒక్కో ఆటోకు దాదాపుగా రూ.లక్ష అదనంగా చెల్లించినట్లు గతంలో ఆరోపణలు రాగా, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. తాగునీటి మోటార్ల మరమ్మతులకు ప్రతి నెలా లక్షల్లో చెల్లింపులు, ఇతరత్రా ఖర్చుల పేరిట రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. వీటన్నింటిపైన స్పెషల్ ఆడిట్ అధికారులు దృష్టి సారించే అవకాశం ఉంది. నిధుల దుర్వినియోగంపై మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం



బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం ఆవరణలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జాతీయ జెండా విష్కరణ, జెండా వందన స్వీకారం, కలెక్టర్ సందేశం, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ప్రశంసాపత్రాలు, మెమొంటోల ప్రదానం, స్టాల్స్ సందర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సరిహద్దుల్లో డ్రోన్ కెమెరా నిఘా



డ్రోన్ కెమెరాలో గ్రామ పరిసరాలు

వేమనపల్లి: రిపబ్లిక్ డే సందర్భంగా ప్రాణహిత సరిహద్దు వెంట చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ముమ్మర కూంబింగ్ చేపట్టారు. పక్కనే ఉన్న ప్రాణహిత నది అవతలి వైపున్న మహారాష్ట్ర గడ్చిరోల్లి జిల్లా సరిహద్దు అడవుల నుంచి నిషేధిత మావోయిస్టులు నది దాటవచ్చనే అనుమానంతో ముందస్తు తనిఖీలు చేపట్టారు. ప్రాణహిత ఫెర్రీ పాయింట్లు, వెంచపల్లి, రాచర్ల, రేగుంట, వేమనపల్లి ప్రాణహిత పుష్కరఘాట్, ముక్కిడిగూడెం నదీ స్థావరాల వెంట డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహించారు. నది దాటే ప్రయాణికులు, సరిహద్దు గ్రామాల ప్రజల రాకపోకలపై నిఘా ఉంచారు. వారు ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, వారు తీసుకెళ్లే వస్తువులను సోదాలు నిర్వహించారు. ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు తనిఖీ చేసి వివరాలు సేకరించారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులు నది దాటి వస్తే సమాచారం అందించాలని బోట్ రైడర్లు, జాలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్సై సుబ్బారావు, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా శాఖ సేవలకు బ్రేక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆన్‌లైన్ వ్యవస్థ అంతరాయంతో గురువారం ఆర్టీఏ(రవాణా శాఖ) సేవలకు బ్రేక్ పడింది. రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ఫిట్‌నెస్ తదితర సేవలన్నీ నిలిచిపోయాయి. ప్రభుత్వ ఆన్‌లైన్ వ్యవస్థతోపాటు ప్రైవేట్ నెట్ కనెక్షన్ కూడా సమయానికి పనీ చేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. కాగా, ఆర్టీఓ కార్యాలయం గ్రామ శివారులో ఉండడంతో విద్యుత్ సరఫరా సమస్య కూడా నిత్యకృత్యంగా మారింది. ఆన్‌లైన్, విద్యుత్ సమస్యలు ఆర్టీఓ కార్యాలయంలో కార్యకలాపాల నిర్వహణకు ఆటంకంగా మారాయి. గురువారం స్లాట్లు బుకింగ్ చేసుకున్న వారికి శనివారం సేవలు అందించేలా స్లాట్ బుకింగ్ అప్‌డేట్ చేయించామని డీటీఓ కిష్టయ్య తెలిపారు.

మైసమ్మకు ఘనంగా పూజలు



డోలు వాయిస్తూ ఖిల్లాపైకి వెళ్తున్న భక్తులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో గురువారం కోవ మొకాశి వంశీయులు గాంధారి మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్య మాస పౌర్ణమిని పురస్కరించుకుని నియమ నిష్టలతో పెద్ద సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఖిల్లా ప్రాంతం జనసంద్రంగా మారింది. సంస్కృతి, సంప్రదాయం ప్రకారం డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

భీమారం: మండలంలోని కొత్తపల్లి ఎస్సీకాలనీలో మంచినీటి కోసం స్థానిక మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మహిళలు మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం మంచినీటి బోరుబావి మోటారు చెడిపోయిందని, నీటి సరఫరా నిలిచి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సర్పంచ్, కార్యదర్శి పట్టించుకోవడం లేదని, మోటారు మరమ్మతు చేయించడం లేదని ఆరోపించారు.

ఓటుతో సమర్థవంతమైన నాయకత్వం

- ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



ఎపిక్ కార్డులు అందుకున్న నూతన ఓటర్లతో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకుని మంచి సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బి.శేషాద్రితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అర్హులు కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు హక్కు లేని వారు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఓటు లాంటిది ఇంకొకటి లేదు–నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఎపిక్‌కార్డులు పంపిణీతోపాటు ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

జంతు సంరక్షణ పౌరుల బాధ్యత

మంచిర్యాలఅగ్రికల్చర్: జంతు సంరక్షణను పౌరులు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పశు వైద్య, సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డా.రమేష్‌తో కలిసి హింస నివారణ సంఘం కరపత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవుల పట్ల కరుణ కలిగి ఉండడం ప్రతీ పౌరుడి విధి అని, వీధి కుక్కల పట్ల సానుభూతితో వ్యవహరించాలని అన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను కలెక్టర్ బి.సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, కలెక్టరేట్ ఏవో పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి, బెల్లంపల్లి డివిజనల్ పరిపాలన అధికారి శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, జిల్లా కార్యదర్శి కృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది, ట్రెసా నాయకులు శ్రీనివాస్, గోవింద్, మధుసూదన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీరో ప్రమాద లక్ష్యంలో భాగస్వామ్యం కావాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య



లారీ యజమానులు, డ్రైవర్లతో డీటీఓ కిష్టయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ జీరో ప్రమాద రహిత జిల్లా లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా రవాణా శాఖా అధికారి(డీటీఓ) ఎల్.కిష్టయ్య కోరారు. 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం మంచిర్యాల లారీ అసోసియేషన్ భవన్‌లో లారీ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీఓ కిష్టయ్య మాట్లాడుతూ భారీ వాహనాలు నడపడంలో జాగ్రత్తలు అవసరమని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని అన్నారు. బ్లైండ్ స్పాట్ల వద్ద నిబంధనలు పాటించడంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఎంవీఐ వివేకానందరెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

శ్రీరాంపూర్: డ్రైవర్లు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డీటీవో ఎల్.కిష్టయ్య తెలిపారు. గురువారం ఆర్కే5 గని సమీపంలో లారీ యార్డులో రవాణా శాఖ అధికారులు కోల్‌బెల్ట్ లారీ అసోసియేషన్ సహకారంతో ఓనర్లు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

మంచిర్యాలటౌన్: జాతీయ ఓటరు దినోత్సవం జిల్లా కేంద్రం మంచిర్యాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో సాయికుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాసీన్ ఫాతిమా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలాజీ, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు ఆనందకుమార్, శ్రీనివాస్, సాంబయ్య, కృష్ణమూర్తి, శోభారాణి, హేమలత, నిర్మల, సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

మంచిర్యాలఅర్బన్: ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు హక్కు వజ్రాయుధంలా పనిచేస్తుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శైలజ అన్నారు. గురువారం ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అండాలమ్మ కాలనీలో వయోజన విద్యాశాఖ, సఖిలైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా ఈడీఎస్సీ కార్పొరేషన్ దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం నాయక్, సఖి లైన్స్‌క్లబ్ అధ్యక్షురాలు శాంకరీ, వైస్ ప్రెసిడెంట్ మంగ, సభ్యులు భాగ్యలక్ష్మి, జ్యోతి, శోభ పాల్గొన్నారు.



ముగ్గులు వేసిన మహిళలు

విద్యార్థులకు బహుమతులు

జన్నారం: జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు గురువారం కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో కిష్టాపూర్ విద్యార్థి గెడం సంతోష్ ప్రథమ బహుమతి, ఉపన్యాస పోటీల్లో అదిబా సాహేర్ తృతీయ బహుమతి సాధించారు. విద్యార్థులను డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో శేషాద్రి, హెచ్ఎంలు రాజన్న, శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులు కమలాకర్, జాడి మురళి పాల్గొన్నారు.

నమో నవ మత్ దాత సమ్మేళన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నమో నవమత్ దాత సమ్మేళన్ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో విద్యార్థులు గురువారం వీక్షించారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. నమో నవమత్ దాత సమ్మేళన్ జిల్లా కో కన్వీనర్ కొండ వెంకటేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని దేవేందర్, రెడ్డిమల్ల ఆశోక్, జిల్లా కార్యదర్శి మద్ది సుమన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముచ్చకుర్తి కిషోర్, కొంతం మహేందర్, తాళ్లపల్లి వంశీ, కావేటి మనీశ్ పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నమో నవమత్ దాత సమ్మేళన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువతను ఉద్దేశించి దేశ పరిస్థితి, స్థితిగతులను యువతకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవమత్ దాత కన్వీనర్ దుగ్నె సాయికృష్ణ, కో కన్వీనర్ తుమ్మ శ్రీపాల్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఆలం బాపు, నాయకులు చింతల రాజు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జంక్షన్ల ప్రారంభం



ఫౌంటేయిన్, వివిధ కులవృత్తులు ప్రతిబింబించేలా వేంకటేశ్వర థియేటర్ చౌరస్తా

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో రూ.4.30 కోట్లతో చేపట్టిన నాలుగు జంక్షన్ల పనులు పూర్తి కావచ్చాయి. ఐబీ చౌరస్తా మినహా వేంకటేశ్వర చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో జంక్షన్ల పనులు పూర్తి కాగా, చుట్టూ రోడ్డు వెడల్పు పనులు చేపట్టాల్సి ఉంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం మూడు జంక్షన్ల ప్రారంభానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో ప్రకృతిని ప్రతిబింబించేలా నాలుగు సీతాకోక చిలుకల ఆకారంలో నిర్మించారు. బెల్లంపల్లి చౌరస్తాలో దేశభక్తిని చాటేలా, త్రివిధ దళాలు, జాతీయ పతాకంతో తీర్చిదిద్దారు. వేంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో అందంగా ఉండే ఫౌంటేయిన్ నిర్మాణంతోపాటు మధ్యలో వివిధ కులవృత్తులు ప్రతిబింబించేలా పలు విగ్రహాలతో అందంగా సిద్ధం చేశారు.




త్రివిధ దళాలు ఉండేలా ఏర్పాటు చేసిన బెల్లంపల్లి చౌరస్తా జంక్షన్

క్లుప్తంగా

ఒంటరి మహిళలు, యువ జంటలే లక్ష్యం

- పోలీసులకు చెబుతామంటూ బెదిరింపులు
- విలేకరులమంటూ దౌర్జన్యం, ఆపై డబ్బులు డిమాండ్
- ఫోన్‌పే ద్వారా రూ.40వేలు వసూలు



బాధితులు ఫోన్ పే చేసిన రిసిప్ట్

మంచిర్యాలక్రైం: ఒంటరి మహిళలు, యువ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నేషనల్ క్రైం బ్యూరో రిపోర్టర్‌గా చెలామణి అవుతున్న కుదురుపాక పోషం మరో వ్యక్తిని తోడుగా తీసుకెళ్లి ఈ నెల 22న రాత్రి జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్ గోదావరి వద్ద ఓ యువతి, ఇద్దరు యువకులను బెదిరించారు. సదరు యువతీ, యువకులు రాత్రి 11గంటల ప్రాంతంలో అక్కడికి రాగా అప్పటికే అక్కడ కూర్చున్న పోషం, మరో వ్యక్తి కలిసి అడ్డుకున్నారు. విలేకరులమంటూ బెదిరిస్తూ మీడియా లోగోతో వారి నుంచి వివరాలు సేకరిస్తూ రికార్డు చేశారు. అసభ్య పదజాలంతో ప్రశ్నలు వేశారు. వివరాలు చెప్పడానికి ఆ జంట నిరాకరించడంతో పోలీసులను పిలిపిస్తామంటూ బెదిరించారు. వీడియో రికార్డు చేసిన అనంతరం వారి నుంచి సెల్‌ఫోన్లు లాక్కెళ్లి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వకపోతే వీడియో వైరల్ చేస్తామని, బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో సదరు యువకుడు రూ.30వేలు ఒకసారి, రూ.10 వేలు మరోసారి మొత్తం రూ.40వేలు సత్యనారాయణ అనే వ్యక్తి నంబరుకు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. జంటను అడ్డగించి బెదిరిస్తూ తీసిన వీడియో వైరల్‌గా మారింది. కాగా, ఈ ఘటనపై స్థానిక సీఐ రాజును సంప్రదించగా.. తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు. బాధితులు, నిందితులను గుర్తించామని, బాధితుల ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పెడదారిలో బాల్యం



తల్లిదండ్రులూ... మీ పిల్లలపై ఓ కన్నేయండి..!





మంచిర్యాల జిల్లాలో నాలుగేళ్లలో నమోదైన పోక్సో కేసులు

ఏడాది	ఫిర్యాదు
2020	61
2021	80
2022	38
2023	30
2024	01

మంచిర్యాలక్రైం: ప్రేమ.. ఆకర్షణ... స్నేహం అనే ఈ పదాలకు అర్థాలు తెలియని జీవితాలు... అన్నీ తమకే తెలుసనుకునే నేటితరం యువత... మంచి చెప్పే మనుషులు, జీవితాలు చక్కదిద్దే గురువులు, మంచి చెప్పే తల్లిదండ్రుల మాటలు పట్టించుకోని నేటి సమాజంలో.. ప్రేమమైకంలో యువత తమ వయసును మరిచిపోయి విష వలయంలో చిక్కుకొని బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ మైకంలో చిక్కుకుని ముక్కుపచ్చలారని పసి పిల్లలు.. అమాయకమైన ఆడపిల్లలు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆధారం కోరుకునే ఒంటరి మహిళలు.. విద్యాసంస్థల్లో మొదలుకొని ఉపాధి పొందే సంస్థల్లోనూ బాలికలు, మహిళలు కామాంధుల చేతిలో బలైపోతున్నారు. వారిపై అఘాయిత్యాల నివారణకు పోక్సో చట్టం తెచ్చిన కామాంధుల తీరు మారడం లేదు.

తెలిసి తెలియని వయసులో...

ఇటీవల జిల్లాలో ప్రేమ పక్షులుగా ఎగిరిపోతున్న యువత సంఖ్య పెరుగుతోంది. బడికి వెళ్తున్న వయసులోనే ఇలా తప్పుదోవలో పడి గర్భం దాల్చుతున్న ఘటనలు కలవర పెడుతున్నాయి. అలాగే అబ్బాయిలు మందు, సిగరేట్లు, గంజాయి వంటి డ్రగ్స్‌కు బానిసైన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక ఓ బిడ్డకు జన్మనించిన ఘటన చర్చనీయాంశమైంది. జిల్లా కేంద్రానికి చెందిన బాలిక, బాలుడు ప్రేమించుకున్న విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. దీంతో పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇలా కనీసం వారంలో ఒకటైనా కేసులు నమోదవుతున్నాయి.

పిల్లలపై పట్టింపు ఏదీ..?

ప్రస్తుతం తల్లిదండ్రులు కుటుంబ పోషణ కోసం బిజీ లైఫ్ గడుపుతున్నారు. చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలు ఏం చేస్తున్నారు.. వారి మనుసులో ఏముందో పసిగట్టలేక పోతున్నారు. పిల్లలతో కనీసం రోజుకు ఒక గంటైన సమయాన్ని వెచ్చించి వారితో స్నేహపూర్వకంగా ఉంటే వారి ఆలోచనలు పసిగట్టే అవకాశం ఉంది. కానీ నాన్న నాకు సెల్ ఫోన్ కావాలి.. నాకు బైక్ కావాలి.. అనగానే వాటిని సమకూర్చుతున్నారు. కానీ ఆ తర్వాత వాటిని ఎలా ఉపయోగిస్తున్నారు.. వారిలో వస్తున్న మార్పులేంటి.. అనే విషయాలను పట్టించుకోవడం లేదు. దీంతో ఏదైన జరగరానిది జరిగిన తర్వాత అందరూ బాధపడుతుంటారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక యాప్...

బాలికలపె జరుగుతున్న అఘాయిత్యాలపై ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతుండడంతో నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారు. చాల మంది భయపడి ఫిర్యాదు చేయడంలేదు. కొందరు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసినా నేరం చేసిన వారి నుంచి వేధింపులకు గురవుతున్నారు. ఇలాంటి వారికి న్యాయం చేయడంతో పాటు నేరం చేసిన వారిని శిక్షించడానికి, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం పోక్సో ఈ-బాక్స్ పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. వంద శాతం పారదర్శకతతో విచారణ జరిపి పోలీసుల సహకారంతో కేసును నమోదు చేసి శిక్షపడేలా కృషి చేస్తారు.

పోక్సో ఈ-బాక్స్‌లో ఫిర్యాదు ఇలా...

పోక్సో ఈ–బాక్స్‌లో ఫిర్యాదు చేసేందుకు గూగుల్‌ప్లే స్టోర్‌లోకి వెళ్లి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ఓపెన్ చేసి ఫిర్యాదు చేయడానికి వృత్తాకారంలో ఉన్న బాక్స్‌ను క్లిక్ చేయాలి. సాధారణంగా చిన్నారులకు ఎదురయ్యే ఆరు రకాల హింసలకు సంబంధించిన చిత్రాలు కనిపిస్తాయి. హింస జరిగిన తీరును గుర్తించే చిత్రంపై క్లిక్ చేయాలి. తర్వాత ఫిర్యాదు పత్రంలో బాధితులు జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను పత్రంలో పొందుపరిచి సమర్పించాలి.

కఠిన చర్యలు తప్పవు



బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోక్సో కేసుల్లో చట్టాలు కఠినంగా అమలవుతున్నాయి. బాలల సంరక్షణ ప్రభుత్వాలతో పాటు ప్రతిఒక్కరిది. ప్రధానంగా తల్లిదండ్రుల పాత్ర కీలకం. బాలలను వారి హక్కులను కాలరాయకుండా వారి వారిని స్వేచ్ఛ వాతావరణంలో సంరక్షించాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలి. మహిళల రక్షణ కోసం షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తోంది. నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

– రెమా రాజేశ్వరి, రామగుండం సీపీ

బెల్లంపల్లి ఏరియా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



తిరుమల్‌రావు



గొల్ల క్రిష్ణ



శ్రీనివాస్



ముట్టి వినోద్



రాజమల్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): గణతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బెల్లంపల్లి ఏరియాలో ఎంపికైన ఉత్తమ ఉద్యోగుల జాబితాను గురువారం ఏరియా అధికారులు ప్రకటించారు. ఉత్తమ అధికారిగా ఏజీఎం (ఈఅండ్‌ఎం)గా విధులు నిర్వహిస్తున్న మోకాళ్ల తిరుమల్‌రావు ఎంపిక కాగా, ఉత్తమ సింగరేణియన్‌గా ఖైరిగూడ ఓసీపీ ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే గొల్ల క్రిష్ణను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏరియా స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా ఖైరిగూడ ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే మారం శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వహించే ముట్టి వినోద్‌తో పాటు గోలేటి సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆకుల రాజమల్లులను ఎంపిక చేశారు. వారిని కొత్తగూడెంలో నిర్వహించే గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సంస్థ సీఅండ్‌ఎండీ బలరాం సన్మానించనున్నట్లు తెలిపారు. ఏరియా స్థాయిలో ఎంపికైన ఉద్యోగులను భీమన్న స్టేడియంలో జరిగే గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ సన్మానించి జ్ఞాపికలను అందజేస్తారని తెలిపారు.

బాక్సింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన సాహిత్

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన రెడ్డపాక సాహిత్ ఈ నెల 21, 22వ తేదీలలో పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో నిర్వహించిన సౌత్ ఏషియన్ సవాటే ఫ్రెంచ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అసాట్ విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు కోచ్ రంగు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రం నుంచి పాల్గొనే పోటీల్లో గెలిచి ఇండియన్ సవటే ప్రెసిడెంట్ సుఖ్‌విందర్‌సింగ్ చేతుల మీదుగా బహుమతి అందుకోవడం జరిగిందని, ఇప్పటికీ పలుమార్లు బహుమతులు గెలుపొందిన సాహిత్‌ను రాజకీయ నాయకులు, స్థానికులు అభినందించారు.

ఢిల్లీ పరేడ్‌కు చెన్నూర్ డ్యాన్స్ మాస్టర్



సంపత్‌కుమార్

చెన్నూర్: ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన కొరియోగ్రాఫర్ కృష్ణపల్లి సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. సంపత్‌కుమార్ గల్లీ నుంచి ట్రెడిషనల్ డ్యాన్సర్‌గా ఎదిగాడు. ఇప్పటికే సంపత్‌కుమార్ పలు రాష్ట్రాల్లో లంబాడా, కోయంకోల డ్యాన్సుల కార్యక్రమాల్లో పాల్గొని జిల్లాకు పేరు తెచ్చారు. ఎలాంటి శిక్షణ లేకుండానే ఏకలవ్యుడిగా డ్యాన్స్ ప్రాక్టీస్ చేసి డ్యాన్స్ మాస్టర్‌గా, కొరియోగ్రాఫర్‌గా ఎదిగి నేడు ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడంపై పలువురు అభినందిస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



తిరుపతమ్మ(ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బూడిద గడ్డ బస్తీకి చెందిన మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైనట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బస్సిలాల్ తెలిపారు. భోగ తిరుపతమ్మ అనే గృహిణి మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 20వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేదు. తిరుపతమ్మ ఆచూకీ తెలిసిన వ్యక్తులు 8712656559 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కూతురు భోగ సుస్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చుక్కల దుప్పి మృతి



కళేబరాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామ సమీపంలో అడవి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృత్యువాత పడింది. గురువారం గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చుక్కల దుప్పిని చూసిన అడవి కుక్కలు వెంబడించి గాయపరచగా దుప్పి భయంతో గ్రామంలోకి పరుగులు తీసింది. అది గమనించిన స్థానికులు అడవి కుక్కలను తరిమికొట్టారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్ చికిత్స అందించే లోగానే దుప్పి మృతి చెందింది. దీంతో దుప్పి కళేబరానికి ఖననం చేశారు.

బావిలోపడి యువకుడు మృతి



మహేష్ (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మహేష్(23) బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మహేష్ కరీంనగర్‌లో మార్బుల్ వర్కు పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సంక్రాంతి పండుగ కోసం ఇంటికి వచ్చి 15వ తేదీన రాత్రి ఫోన్ చూస్తుండగా చూడొద్దని తల్లి చెప్పింది. మరుసటి ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, BAYYALA MALLESH, (Old Name), R/o. H.No. 6-171/3, Indhanpally, Mandal Jannaram, Dist: Mancherial, T.S., I have changed my name to BIYYALA MALLESH, S/o. RAJAM (New Name), for all future purposes.

ప్రత్యామ్నాయం లేక పాతదారిలోనే..

- దాడులు చేస్తున్నా ఆగని దందా
- ఏడాదిలో 116 కేసులు
- 5460 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తులు
- కేసులపాలవుతున్న గిరిజనులు



తహసీల్దార్ ఎదుట బైండోవర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధిమార్గాలు లేక మళ్లీ సారాయి తయారీనే నమ్ముకుంటున్నారు. ఫలితంగా కేసుల పాలవుతున్నారు. ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నా సారాయి తయారీ మాత్రం ఆగడం లేదు. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. జిల్లాలోని తండాలు, అటవీ సమీప గ్రామాల్లో యథేచ్ఛగా గుడుంబా తయారీ చేసి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఏడాదిలో ఎక్సైజ్ అధికారులు 116 కేసులు నమోదు చేశారు. 5,460 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 459 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. గతంలో నాటుసారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉన్న వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించింది. రుణాలు సైతం అందించి వ్యాపారులు పెట్టుకునేలా సహాయం అందించింది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని చాలామంది గిరిజనులు కొందరు ఆటోలు, హోటళ్లు, దుకాణాలు పెట్టుకొని ఉపాధి పొందారు. అయితే ఆ పథకం కొందరికే లబ్ధి చేకూర్చింది. తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో పలువురు గిరిజనులు మళ్లీ నాటుసారా తయారీ, విక్రయాలబాట పట్టారు.

చీకట్లోనే సరఫరా

తండాలు, పల్లెల్లో తయారవుతున్న గుడుంబాను రాత్రి వేళల్లో తయారీదారులే సిరిసిల్ల, కామారెడ్డి, వేములవాడ పట్టణాలకు తరలిస్తున్నారు. రాత్రి పూట గుడుంబాను తయారుచేసి తెల్లవారు జామున బైక్‌ల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అడ్డా కూలీలు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు చేరవేస్తున్నారు. సారా తాగి చాలా మంది అనారోగ్యం పాలవుతున్నా జనం మాత్రం మారడం లేదు. ఫలితంగా తయారీదారులకు కాసులవర్షం కురిపిస్తుంది.

వరుస దాడులు.. ఆగని దందా

అధికారులు అనేకసార్లు దాడులు చేస్తున్నా గుడుంబా తయారీదారుల్లో మార్పు రావడం లేదు. ఏడాదికాలంలో జిల్లాలో 61 మందిపై ఎక్సైజ్, పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో బెల్లం విక్రయాల కేసులు రెండు ఉన్నాయి. మొత్తం ఏడాదిలో 116 కేసులు నమోదు చేయగా, 94 మందిని బైండోవర్ చేశారు. ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట అధికారులు దాడులు చేసి బెల్లం పానకం ధ్వంసం చేస్తూ.. నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. అయితే పీడీయాక్ట్ నమోదు చేసి సారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తే తప్పా ఈ దందాకు బ్రేక్ పడదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మళ్లీ.. మళ్లీ పట్టుబడుతూ..

నాటుసారా తయారీ, విక్రయాల్లో పాతవారే ఎక్కువగా పట్టుబడుతున్నారు. గతంలో నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తుండగా పట్టుబడ్డ వారే మళ్లీ విక్రయిస్తూ దొరుకుతున్నారు. పట్టుబడ్డ నేరస్తులను అధికారులు తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేస్తారు. ఆ సమయంలో రూ.లక్ష పూచీకత్తు ఇచ్చి విడుదలవుతారు. ఏడాదిలో తిరిగి నేరానికి పాల్పడితే రూ.లక్ష పూచీకత్తు సొమ్మును చెల్లించాల్సిందే. ఇలా ఏడాదిలో రూ.7.66 లక్షలు జరిమానాలు చెల్లించారు. సారా తయారీదారుల్లో మార్పు రాకపోవడంతో నేరాల సంఖ్య పెరుగుతూనే ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దండోరా వేయించి, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా నాటుసారా మత్తుకు ప్రజలు దూరం కావడం లేదు.



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న అధికారులు

కఠిన శిక్షలు అమలు



నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పటిక విక్రయిస్తే కఠిన శిక్షలు అమలు చేస్తాం. ప్రస్తుతం శిక్షల స్వరూపం మారిపోయాయి. బెల్లం అమ్మితే పదిహేను రోజుల వరకు బెయిల్ మంజూరు కావడం లేదు. పాతనేరస్తులకు నెల రోజుల వరకు నిబంధనలతో బెయిల్ ఇస్తున్నారు. గుడుంబా తయారీ, విక్రయదారుల గురించి తమకు సమాచారం అందించాలి. గుడుంబా విక్రయాలను అరికడతాం.

– ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట

రాజన్నకు సీతక్క పూజలు

వేములవాడ: రాజన్నను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఘనస్వాగతం పలికారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభకలశంతో ఆలయ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం అద్దాల మండపంలో ప్రసాదాలు అందించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రాజన్న తమ ఇలవేల్పు అని, చిన్నప్పటి నుంచి ఇక్కడికి వస్తూనే ఉంటామన్నారు. రెండేళ్లకోమారు వచ్చే సమ్మక్క, సారలక్క జాతర మహోత్సవాలకు ముందుగా రాజన్నను దర్శించుకుని వెళ్లే సాంప్రదాయం ఉందన్నారు. ఈసారి సమ్మక్క జాతరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీవో మధుసూదన్ రావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

శాతకర్ణి-1 కుమారుడే ఆస్మాకరాజ్య పాలకుడు

- పెద్దపల్లిలో శాతవాహనుల శాసనంలో వెలుగులోకి



పెద్దపల్లి జిల్లా గట్టుసింగారంలో లభించిన శాసనం

సాక్షి, పెద్దపల్లి: దక్షిణ భారతంలో తొలి సామ్రాజ్యంగా ఏర్పడిన శాతవాహన రాజ్యం కోటిలింగాల కేంద్రంగా పరిపాలన కొనసాగించారు. ఇది నిరూపించేలా పెద్దపల్లి జిల్లాలోని గట్టుసింగారం ప్రాంతంలో శాతవాహన యువరాజు హకుసిరికి సంబంధించిన శాసనం లభ్యమైంది. ఈ శాసనం ఒకటో శతాబ్దానికి చెందిన ప్రాకృతం, బ్రాహ్మీలిపిలో ఉందని పురావస్తుశాఖ మాజీ అధికారి బీఎం.రెడ్డి, ఫొటో జర్నలిస్టు డి.రవీందర్ తెలిపారు. ఈ శాసనంలో శాతకర్ణి-1, అతడి భార్య నాగానిక కుమారుడు హకుసిరి, అతడి స్నేహితుడు హరిశ్రీపుత్ర గురించి తెలిపేలా అసంపూర్తిగా ఉందని, అలాగే 16 మహాజన పదాల్లో ఒక్కటైన ఆస్మాకా ప్రాంతాన్ని పరిపాలించినట్లు అందులో ఉన్నట్లు గుర్తించారు. గతంలో శాతకర్ణి-1 కుమారుడు హకుసిరి గురించి తెలిపే శాసనం కరీంనగర్ జిల్లా ముక్కట్‌రావుపేటలో లభించిందని, ఇది రెండో శాసనమన్నారు. శాతకర్ణి కుమారుడు హకుసిరి గురించి నానేఘడ్ శాసనంలో ఉందని తెలిపారు.



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

- సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సర్పంచులను సన్మానిస్తున్న మాజీ మంత్రి

ధర్మపురి: గెలిచినా.. ఓడినా ప్రజాసమస్యలపై నిరంతర పోరాడాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్పంచులు ఐదేళ్ల పాలనను విజయవంతంగా ముగించుకుంటున్న సందర్భంగా గురువారం స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ తిరిగి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండు నెలలు కాకముందే కరెంట్ కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు సాధ్యంకానివన్నారు. అంతకముందు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ సర్పంచులను సన్మానించి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, నాయకులు సొల్లు భీమయ్య తదితరులున్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



- 30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ: వేములవాడ రాజన్నను గురువారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాక పెరగడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.

30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జగద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కళాకారులను ఎంపిక చేశారు. ఆహ్వాన పత్రికలను ముద్రించారు. ఐదు రోజుల పాటు త్యాగరాజ స్వామి కీర్తనలు, కూచిపూడి, నృత్య, నాటక ప్రదర్శనలతో రాజన్న క్షేత్రం ఓళలాడనుంది.

సిరిసిల్ల అడిషనల్ ఎస్పీకి ప్రెసిడెంటల్ మెడల్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య ప్రెసిడెంటల్ మెడల్‌కు ఎంపికయ్యారు. సుదీర్ఘకాలంగా పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో చూపిన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం చంద్రయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 1991లో ఎస్సైగా పోలీసుశాఖలో ఉద్యోగం పొందిన చంద్రయ్య తొలిపోస్టింగ్ కొత్తగూడెంలో. 2007లో సీఐగా పదోన్నతి పొంది వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పనిచేశారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొంది రామగుండం క్రైం ఏసీపీగా, హన్మకొండ, సైబరాబాద్ ఏసీపీగా పనిచేశారు. 2021లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది సిరిసిల్లలో బాధ్యతలు స్వీకరించారు. పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారిగా సేవలను గుర్తించి ప్రెసిడెంటల్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక చేస్తూ గురువారం సమాచారం ఇచ్చారు. దీనిపై ఏఎస్పీ చంద్రయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ అన్ని హోదాలను, కఠిన శాఖల్లో పనిచేసిన విధానాలను పరిగణలోకి తీసుకుని పతకానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందని, పోలీసుశాఖలో పనిచేయడంలో ఆ అవకాశం దొరికిందన్నారు. త్వరలోనే రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన ఏఎస్పీ చంద్రయ్యను జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ గురువారం అభినందించారు. ఈ అవార్డుకు ఎంపికవడం జిల్లాకు గర్వకారణంగా ఉందన్నారు.



చంద్రయ్య



శిథిలావస్థలో కోట



కొనసాగుతున్న కోనేరు నిర్మాణ పనులు

గోండు రాజుల కోటకు కొత్త కళ

గోండుల వైభవానికి చిహ్నంగా నిలిచిన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పురాతన గోండు రాజుల కోట పూర్వ వైభవాన్ని సంతరించుకుంబోంది. కేబీ కాంప్లెక్స్ సమీపంలోని ఈ కోట నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరి కోనేరు, కోట ప్రధాన భాగాలు కూలిపోయాయి. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించిన అప్పటి ప్రభుత్వం రూ.2.30కోట్లు మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతుండటంతో త్వరలోనే కోట కొత్త కళ సంతరించుకోనుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు

సంప్రదాయబద్ధంగా మహాపూజ

- జంగుబాయి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు
- ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు



గుహ వద్ద ఎంపీ సోయం బాపూరావు, నాయకులు, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో గురువారం మహాపూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం సిద్ధికసలోని జై జంగు శైలింగు దీక్షాపరులతో కలిసి సిద్ధికసలోని గుహలోకి వెళ్లి పుణ్యస్నానం ఆచరించారు. జంగు, లింగు దేవతలు, శివలింగానికి పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు పని కట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని, తుడుందెబ్బకు ఎలాంటి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. ఆలయానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, టొప్లకసలో రూ.10లక్షలతో షెడ్డు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర ఆలయ కమిటీ చైర్మన్లు కొడప జాకు, వెట్టి చందు, సర్పంచ్ లింబాదాస్, పూజారి హన్మంత్‌రావు, కటోడ నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాం.. ఎమ్మెల్సీ

- గవర్నర్ కోటాలో పదవిపై హర్షం
- స్వస్థలం నెన్నెల మండలం జోగాపూర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ముద్దసాని కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ఆయనకు పదవీ దక్కడంపై మంచిర్యాల జిల్లా వాసులు, సన్నిహితులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు నుంచి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్‌కు వలస వచ్చారు. తల్లిదండ్రులు జనార్దన్‌రెడ్డి, వెంకటమ్మ. ఏడుగురు సంతానంలో కోదండరాం ఒకరు. కోదండరాం 1955 సెప్టెంబర్ 5న జన్మించారు. భార్య సుశీల కాగా, వీరికి ఇద్దరు సంతానం. అందరూ ఉద్యోగ, వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆయన సోదరుడు రంగారెడ్డి కుటుంబం మాత్రం ప్రస్తుతం జోగాపూర్‌లోనే ఉంటోంది. బాల్యం నుంచే రాడికల్ భావజాలంతో పెరిగిన కోదండరాం ఉమ్మడి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా బోధించి రిటైర్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించారు. ఉమ్మడి జిల్లా వాసులు అనేకమందితో సాన్నిహిత్యం ఉంది. తెలంగాణ విద్యావంతుల వేదిక, సింగరేణి ఓపెన్‌కాస్టులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనూ ఇక్కడికి పలుమార్లు వచ్చారు. ఇప్పటికీ తమ వారసత్వంగా ఇల్లు, ఆస్తులు, భూములు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై ఆయన సన్నిహితులు, స్నేహితులు గుర్తు చేసుకున్నారు.



కోదండరాం

'మంచిర్యాల–అంతర్గాం' బ్రిడ్జి నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీ రోడ్డు నుంచి అంతర్గాం వరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని పోరాడి సాధించామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జి గుండా మంచిర్యాల నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వరకు ప్రయాణిస్తే 45 నిమిషాలు ముందుగానే వెళ్తారని అన్నారు. 2018 ఎన్నికల సమయంలో సీఎం హోదాలో కేసీఆర్ శ్రీరాంపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడామని అన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.64 కోట్లు విడుదల కాగా, మూడు నెలల క్రితం టెండరు కూడా పూర్తి చేశారని తెలిపారు. ప్రస్తుతం పనులను ప్రారంభించడం వల్ల వర్షాకాలం నాటికి పిల్లర్ల నిర్మాణం పూర్తయి, బ్రిడ్జిని రెండేళ్లలో నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చానని అన్నారు. కొందరు మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జిని నిర్మించకుండా, ముల్కల్ల వద్ద నిర్మించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దాని వల్ల ప్రజలకు మేలు జరగకపోగా కోర్టు కేసులు, భూపరిహారం ఇలా ఏళ్ల తరబడి బ్రిడ్జి నిర్మాణానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, బ్రిడ్జిని ముల్కల్లకు ఎవరు మార్చాలని అనుకుంటున్నారో తెలియడం లేదని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపాలని ఎవరైనా చూస్తే తాను ఊరుకోబోనని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

ఖండేవ్ పుణ్యక్షేత్రానికి తొడసం వంశీయులు



మాసేమాల్ దేవతకు పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు

నార్నూర్: తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖండేవ్ ఆలయ పుణ్యక్షేత్రానికి తొడసం వంశస్తులు సంప్రదాయ వాయిద్యాలతో ఎడ్లబండిపై గురువారం చేరుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని మాన్కాపూర్ వద్ద మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం పూజలు చేశారు. మధ్యాహ్నం ఎడ్లబండిపై కొందరు.. మరి కొందరు పూజ సామగ్రితో కాలినడకన ఖండేవుని పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. వారితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల ఆదివాసీ గిరిజనులకు ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. తరతరాల నుంచి సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. ఖండేవు ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొడసం వంశానికి చెందిన కటోడ బాపురావు, తెలంగాణరావు, తొడసం నాగోరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, నాయకుడు సయ్యద్‌ఖాశీం తదితరులున్నారు.



ఖండేవుని సంప్రదాయ మహాపూజలో ఎమ్మెల్యే





ఆర్టీసీ బస్టాండ్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్

నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులను ద్విచక్రవాహనాలపై బస్టాండ్‌కు తీసుకువస్తున్నవారు నోపార్కింగ్ ప్లేస్‌లో బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు పాయింట్‌పైకి తీసుకురావడానికి డ్రైవర్లుఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాల తీరు మారడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

